క్లుప్తంగా

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించింది



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్

సోంపేట: మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని స్థానిక ఎమ్మెల్యే బి.అశోక్ అన్నారు. సోంపేట పట్టణంలో ఉచిత కుట్టుమిషన్ శిక్షణ శిబిరాన్ని బుధవారం. టీడీపీ నాయకులు సూరాడ చంద్రమోహన్, మద్దిలి నాగేశ్వరరావు, జుత్తు పురుషోత్తం పాల్గొన్నారు.

ఆహ్వాన బోర్డులు ప్రారంభం



కొత్తగా ఏర్పాటు చేసిన ఐలవ్ పలాస-కాశీబుగ్గ బోర్డు

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోకి వచ్చే ప్రజలను ఆకర్షించేలా జంట పట్టణాల పేరుతో ఏర్పాటు చేసిన బోర్డులను స్థానిక ఎమ్మెల్యే గౌతు శిరీష బుధవారం ప్రారంభించారు. కాశీబుగ్గ పాతజాతీయ రహదారి-అక్కుపల్లి కూడలిలో మున్సిపల్ నిధులతో వీటిని ఏర్పాటు చేశారు.

రోగులతో కిటకిట..



ఓపీ విభాగం వద్ద రోగులు

టెక్కలి: టెక్కలిలోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి బుధవారం రోగులతో కిటకిటలాడింది. వేసవి నేపథ్యంలో సీజనల్ వ్యాధులబారిన చాలా మంది పడుతున్నారు. వీరంతా చికిత్స కోసం ఆస్పత్రికి రావడం ఓపీ విభాగం కిటకిటలాడుతూ కనిపించింది. అయితే వైద్యసేవల విషయంలో మాత్రం రోగులు పెదవి విరుస్తున్నారు.

ఉచిత వైద్యశిబిరం



రోగిని పరీక్షిస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం: మున్సిపాలిటీ పరిధి ఉప్పలవీధిలో రాగోలు జెమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. 7, 8 వార్డులకు చెందిన 82 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అవసరమైన వారికి మందులను అందజేశారు. వైద్యులు షేక్‌సదాఫ్, టెక్నీషియన్లు హిమబిందు, మహేష్, వైద్య సిబ్బంది ఎన్.సంతోష్, రంగాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వైభవంగా కుంకుమ పూజలు



కుంకుమ పూజ చేస్తున్న మహిళలు

కంచిలి: మండలంలోనిసాలిన పుట్టుగ గ్రామంలో సుబ్రహ్మణ్యస్వామి ఆలయ ప్రతిష్ట కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. మహిళలు కుంకుపూజలు చేశారు.

16న ప్రేమవాహిణి రథయాత్ర

కాశీబుగ్గ: సత్యసాయి ప్రేమ వాహిని రథయాత్రను ఈ నెల 16వ తేదీన నిర్వహిస్తున్నట్లు శ్రీకాకుళం సాధన శిబిరం ఇన్‌చార్జి శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ, తాళభద్ర, అక్కుపల్లి, బైపల్లి, వజ్రపుకొత్తూరు గ్రామాల్లో యాత్ర జరుగుతుందన్నారు. యాత్రను విజయవంతం చేయాలని కోరారు.

కొత్త పింఛన్లకు ఎదురు చూపులు!



కంచిలి మండల పరిషత్ కార్యాలయం

- దరఖాస్తు చేసుకునే వీల్లేక ఇబ్బందులు
- కార్యాలయాల చుట్టూ అర్హుల ప్రదక్షిణలు

కంచిలి: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 11 నెలలు దాటుతున్నా నేటికీ ఒక్క సంక్షేమ పథకం కూడా సమర్థవంతంగా అమలు చేసిన దాఖలాలు లేవు. చివరికి ఏదిక్కు మొక్కు లేని వృద్ధులు, వితంతవులకు కూడా పింఛన్లు మంజూరు చేసేందుకు వెనుకంజ వేస్తుంది. జిల్లాలో పింఛన్లకు వేలాది మంది అర్హులు ఉన్నా వారికి నిరాశే ఎదురవుతుంది. పింఛన్ సొమ్ము పొందుతున్న భర్త చనిపోతే భార్యకు మాత్రమే బదిలీ చేస్తున్నారు. పింఛన్‌రాని వ్యక్తి చనిపోతే ఆయన భార్యకు మొండిచేయి చూపుతున్నారు.

ప్రజల నుంచి విమర్శల వెల్లువ

పింఛన్ డబ్బులు పెంచామని గొప్పలు చెబుతున్న కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 11 నెలలు గడుస్తున్నా కొత్తగా ఒక్కరికి కూడా పింఛన్ మంజూరు చేయకపోవడంపై ప్రజల నుంచి తీవ్రస్థాయిలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇచ్ఛాపురం నియోజకవర్గంలో అధికశాతం మంది పేద, మధ్య తరగతి వారు ఉన్నారు. వృద్ధులు, దివ్యాంగులతోపాటు వితంతువులకు కూడా పింఛన్లు మంజూరు చేయకపోవడంతో వారంతా అవస్థలు పడుతున్నారు. తాజాగా స్పౌజ్ కేటగిరీలో పింఛన్లు మంజూరుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఏదైనా పింఛన్ పొందుతూ భర్త మృతి చెందిన మహిళలకు మాత్రమే ఈ కేటగిరీలో పింఛన్లు మంజూరు చేస్తారు. వివిధ కేటగిరీల్లో పింఛన్లు కోసం ఎదురు చూస్తున్న వారికి నిరాశే మిగులుతుంది.

ఎన్నాళ్లు ఎదురుచూపులు..

కొత్త పింఛన్లకు సంబంధించి ఎటువంటి దరఖాస్తులు స్వీకరించడం లేదు. తాజాగా ఇచ్చిన ఉత్తర్వుల మేరకు 2023 డిసెంబర్ ఒకటి నుంచి 2024 అక్టోబర్ 31 తేదీల మధ్య సామాజిక పింఛన్‌దారు మరణిస్తే వారి భార్యలకు స్పౌజ్ కేటగిరీలో పింఛన్ మంజూరుకు అర్హులుగా నిర్ధారిస్తున్నారు. దీంతో ఎటువంటి పింఛన్ పొందని వ్యక్తి మరణించినా ఆ కుటుంబంలో అర్హులకు నిరాశే ఎదురవుతుంది. నియోజకవర్గంలో వందలాది మంది వితంతువులు పింఛన్ పొందేందుకు అర్హులుగా ఉన్నారు. పింఛన్ల సంఖ్య పెంచకుండా ప్రభుత్వం సర్దుబాటు చేస్తుందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

అర్హులు ఎదురు చూస్తున్నారు..



కూటమి ప్రభుత్వం ఏర్పాటై 11 నెలలు గడుస్తున్నప్పటికీ కొత్త పింఛన్లు మంజూరు చేయకపోవడంతో అర్హులైన వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు ఎదురు చూస్తున్నారు. వీరంతా పేద, మధ్య తరగతి వర్గాలకు చెందినవారే. ఇప్పటికైనా అర్హులైన వారందరికీ కొత్త పింఛన్లు మంజూరు కోసం మార్గదర్శకాలు జారీ చేయాలి.

– నర్తు రామారావు, జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ

స్పౌజ్ కేటగిరీ పింఛన్లు ఇస్తున్నాం..



2023 డిసెంబర్ ఒకటి నుంచి 2024 అక్టోబర్ 31వ తేదీ మధ్య సామాజిక పింఛన్‌దారు మరణిస్తే వారి భార్యలకు స్పౌజ్ కేటగిరీలో పింఛన్ మంజూరుకు అవకాశం ఉంది. మండల పరిధిలో వీటిని ఎప్పటికప్పుడు అందజేస్తున్నాం.

–వి.తిరుమలరావు, ఎంపీడీవో, కంచిలి

దివ్యాంగుల ధ్రువపత్రాల పరిశీలన

ఇచ్ఛాపురం టౌన్: స్థానిక ప్రభుత్వ సామాజిక ఆస్పత్రిలో 101 మంది దివ్యాంగుల ధ్రువపత్రాలను బుధవారం డాక్టర్ వెంకటరాజేష్ పరిశీలించారు. దివ్యాంగుల పింఛన్‌ల కోసం వారి సర్టిఫికెట్లను పరిశీలించాలని అధికారులను ప్రభుత్వం ఇటీవల ఆదేశించింది. ఇందులో భాగంగా పట్టణానికి చెందిన 141 మంది ధ్రువపత్రాలను అధికారులు పరిశీలించేందుకు శిబిరాన్ని ఏర్పాటు చేశారు. వీరిలో 40 మంది గైర్హాజరైనట్టు ఆస్పత్రి సూపరింటెండెంట్ పి.దేవేంద్రరెడ్డి తెలిపారు.



ధ్రువపత్రాల పరిశీలనకు హాజరైన దివ్యాంగులు

వీక్లీ ప్రత్యేక రైళ్ల నిలుపుదలపై డీఆర్‌ఎం స్పందన

కవిటి: ఇచ్ఛాపురం నియోజకవర్గంలో వారంలో నడిచే పలు రైళ్ల నిలుపుదల కోసం ఇచ్చిన వినతిపత్రంపై రైల్వే డీఆర్‌ఎం కార్యాలయం నుంచి స్పందన లభించిందని ఎమ్మెల్సీ నర్తు రామారావు కార్యాలయం నుంచి బుధవారం ఔ ప్రకటన విడుదలైంది. పూరీ-అహ్మదాబాద్-పూరీ, పూరీ-యశ్వంత్‌పూర్-పూరీ, విశాఖపట్నం-అమృతసర్-విశాఖపట్నం రైళ్లను ఇచ్ఛాపురంలో నిలుపుదల చేయాలని డీఆర్‌ఎంకు వినతిపత్రంలో నర్తు రామారావు కోరారు. ఈ హాల్ట్ కోసం ఇప్పటికే ఉన్నతాధికారులకు నివేదిక అందించామన్నారు. ఉన్నతాధికారుల అనుమతులు వచ్చిన వెంటనే హాల్ట్‌లు వస్తాయని ప్రత్యుత్తరంలో డీఆర్‌ఎం కార్యాలయం అధికారులు తెలిపారు. అలాగే ఇచ్ఛాపురంలో పాతాళేశ్వరుని కోవెల, రత్తకన్నరోడ్డులో అండర్‌పాసేజ్‌ల నిర్మాణాలకు ఆమోదం ఉత్తర్వులు వెలువడినట్టు డీఆర్‌ఎం కార్యాలయం నుంచి తనకు అందిన లేఖలో తెలిపారని ఎమ్మెల్సీ రామారావు పేర్కొన్నారు.

మున్సిపాలిటీకి నీటి సరఫరా ప్రారంభం

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీకి మంచి నీరు అందించడానికి ఉద్దాన వాటర్ ప్రాజెక్టుకు అనుసంధానం చేసిన పైపులైన్‌ను బుధవారం ప్రారంభించారు. మున్సిపల్ నిధులు రూ.63 లక్షలతో కాశీబుగ్గ పాతజాతీయ రహదారి అక్కుపల్లి కూడలి వద్ద ఏర్పాటు చేసిన తాగునీటి సరఫరా విభాగాన్ని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష, మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబులు ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎన్.రామారావు, నాయకులు లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు, డొక్కరి శంకర్, ఎం నరేంద్ర, మల్లా శ్రీనివాసరావు, దువ్వాడ శ్రీకాంత్, దడియాల నర్సింహులు, కొండే నర్సింహులు, వార్డు కౌన్సిలర్ డిక్కల ఆనంద్, మున్సిపల్ డీఈ కనకరాజు, ఏఈ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.



కుళాయిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శిరీష

ఖరీఫ్ యాక్షన్ ప్లాన్‌పై అవగాహన సదస్సు

కాశీబుగ్గ: పలాస మండలం బంటుకొత్తూరు గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై గ్రామ పెద్దల సమక్షంలో గ్రామ సభను బుధవారం నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయ కార్యకర్త నాగరాజు..ప్రకృతి వ్యవసాయం ఆవశ్యకతను, నవ ధాన్యాల సాగువలనతో కలిగే ప్రయోజనాలు, 365 డీజీసీ వలన కలిగే లాభాలు, ఏటీఎం, ఏ-గ్రేడ్ మోడల్ గురించి, ప్రకృతి వ్యవసాయంలో అనుసరించవలసిన పద్ధతులు, కిచెన్ గార్డెన్ గురించి గూర్చి, విపులంగా వివరించారు. అలాగే ఏపీసీఎన్ఎఫ్ పద్ధతిలో పంటలు పండించిన ఉత్తమ రైతులు కె.ధర్మారావు, కె.మోహనరావులను సత్కరించారు.



అవగాహన సదస్సులో రైతులు

ఎంపీడీవోను కలిసిన కార్యదర్శులు

నందిగాం: నందిగాం ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టిన కుమార్ పట్నాయక్‌ను ఈఓపీఆర్‌డీ రాజారావు, పంచాయతీ కార్యదర్శులు బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను దుశ్శాలువతో సత్కరించారు. సంతబొమ్మాళి ఎంపీడీవో కార్యాలయ పరిపాలనాధికారిగా ఉన్న కుమార్ పట్నాయక్ ఎంపీడీఓగా పదోన్నతిపై ఇక్కడ నియమితులయ్యారు. మండల అభివృద్ధికి అందరూ సహకరించాలని కోరారు.



ఎంపీడీవో పట్నాయక్‌ను సత్కరిస్తున్న సిబ్బంది

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

ఇచ్ఛాపురం రూరల్: మండల పరిధిలో విద్యుత్ మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో శుక్రవారం పలు గ్రామాలకు సరఫరాను నిలిపి వేస్తున్నట్టు పలాస ఈఈ జి.యజ్ఞేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. తేలుకుంచి, హరిపురం, మశాఖపురం, జగన్నాథపురం, బిర్లంగి, తోటూరు గ్రామాలకు ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు సరఫరాను నిలిపి వేస్తామని.. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

నవధాన్యాల సాగుపై అవగాహన

టెక్కలి: ఖరీఫ్‌లో నవధాన్యాల సాగుపై రైతులు ఆసక్తి చూపాలని ప్రకృతి వ్యవసాయం యూనిట్ ఇన్‌చార్జి డి.బాలకృష్ణ సూచించారు. నవధాన్యాల సాగుపై చాకిపల్లి గ్రామంలో అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది అశోక్‌కుమార్, గోవింద్ పాల్గొన్నారు.

ఎంఐజీ లేఅవుట్‌లో ప్లాట్ల కోసం డ్రా

కాశీబుగ్గ: ప్రతిఒక్కరికి ప్లాట్ లభించేలా అధికారులు చర్యలు చేపడుతున్నారని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. బొడ్డపాడులో ఎంఐజీ లేఅవుట్-2లో 240, 200, 150 చదరపు గజాల ప్లాట్‌ల కోసం బుధవారం కాశీబుగ్గ హైస్కూల్ ఆవరణలో డ్రా తీశారు. ఎం.ఐ.జి లేఅవుట్-1లో 240 చదరపు గజాల స్థలం రానివారికి లేఅవుట్-2లో అవకాశం కల్పిస్తున్నామని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చెప్పారు. మరో 15 రోజుల్లో ఎం.ఐ.జి లేఅవుట్-2కి సంబంధించిన ఎంపికలు పూర్తి చేసి అర్హులకు ఫోన్‌లో సమాచారం ఇస్తామని సుడా అధికారులు వెల్లడించారు. కార్యక్రమంలో సుడా ప్లానింగ్ ఆఫీసర్ అమర్నాథ్, ఏపీవో కృష్ణ, జేపీవో శాస్త్రి, సెక్రటరీ ఎం.వి.లక్ష్మి, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు పి.మోహన్, పి.వెంకటేష్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు

ఇచ్ఛాపురం రూరల్: వ్యవసాయంలో అధిక దిగుబడులు సాధించాలంటే ప్రకృతి వ్యవసాయమే మేలని మండల వ్యవసాయాధికారి టి.భార్గవి అన్నారు. బుధవారం పాయితారి గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై రైతులతో కలసి ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కట్టె జనుమ, జీలుగ, పిల్లి పెసర వంటి పచ్చిరొట్ట విత్తనాలతో పాటు 15 రకాలకు చెందిన విత్తనాలను కలిపి ఎకరానికి 12 కిలోల చొప్పున జల్లుకుంటే భూమికి అనేక సారవంతమైన పోషకాలు అందుతాయని అన్నారు. ఈ సందర్భంగా రైతులకు నవధాన్యాలు కిట్లు అందిజేశారు.

పోలీసుల విస్తృత తనిఖీలు

కాశీబుగ్గ: పలాస కేంద్రంగా ఒడిశా రాష్ట్రం నుంచి అత్యధికంగా గంజాయి వంటి మత్తు పదార్థాలు ఇతర రాష్ట్రాలకు ఎగుమతులు అవుతున్నాయి. అనేక మందిని పట్టుకుని కేసులు పెడుతున్నప్పటికీ తగ్గడం లేదు. దీంతో కాశీబుగ్గ పోలీసు డివిజన్ పరిధిలో డ్రగ్స్ నియంత్రణ కోసం డీఎస్పీ వెంకటఅప్పారావు నేతృత్వంలో నార్కోటిక్ డ్రగ్స్ కోసం పోలీసుల జాగిలాలతో బుధవారం విస్తృత తనిఖీలు చేపట్టారు. పలాస రైల్వేస్టేషన్ పరిసరాలతో పాటు పలు ప్లాట్‌ఫారాలు, వందేభారత్ రైలులో ప్రయాణికుల బ్యాగులను తనిఖీ చేశారు.

విద్యార్థినులకు ప్రతిభ అవార్డుల ప్రదానం

వజ్రపుకొత్తూరు రూరల్: ఇటీవల విడుదలైన పదో తరగతి పరీక్షల్లో అధిక మార్కులతో ప్రతిభ కనబర్చిన విద్యార్థినులకు అక్కుపల్లిలో బుధవారం ఏర్పాటు చే కార్యక్రమంలో శ్రీరామ సేవా సంఘం ఆధ్వర్యంలో ప్రతిభ అవార్డులు ప్రదానం చేశారు. గ్రామానికి చెందిన 23 మంది పరీక్ష రాయగా అందులో ఇప్పిలి హర్షిత 96.6 శాతం మార్కులతో ప్రథమ స్థానంలో నిలవగా జోగి భావాని 95.6 శాతంతో ద్వితీయ స్థానం, మోస చార్మి 94.5 శాతంతో తృతీయ స్థానంలో నిలిచారు. వీరికి నగదు బహుమతులతో పాటు జ్ఞాపికలను అందజేసి అభినందించారు. విద్యార్థుల ఉన్నత చదువులకు శ్రీరామ సేవా సమితి ప్రోత్సాహం అందిస్తుందని సంఘ ప్రతినిధులు పేర్కొన్నారు. కార్యక్రమంలో సేవా సంఘం అధ్యక్షులు మోస వరప్రసాదరావు, కాస సోమశేఖర్, సింగుపల్లి బాలక్రిష్ణ, లండ మురళి, ప్రధాన కార్యదర్శి అర్జాల ఈశ్వరరావు, కోశాధికారి కాస చలపతి, సింగుపల్లి జగన్నాధం, బర్రి భూపతి, జేజేరావు, సూరాడ లోకనాధం, అనిల్, మద్దు మురళి న్నారు.



విద్యార్థినులకు బహుమతులు అందజేస్తున్న సంఘ సభ్యులు

శాశ్వత ట్యాక్సీ స్టాండ్ కేటాయించాలని విజ్ఞప్తి

టెక్కలి: టెక్కలి పట్టణంలో శాశ్వత ట్యాక్సీ స్టాండ్ ఏర్పాటు చేసి కార్మికులను ఆదుకోవాలని సీఐటీయూ నాయకుడు ఎన్.షణ్ముఖరావు డిమాండ్ చేశారు. వైఎస్సార్ జంక్షన్‌లో ఉన్న ట్యాక్సీ స్టాండ్‌ను ఇటీవల తొలగించడంతో స్థానిక పోలీస్‌స్టేషన్ సమీపంలో తాత్కాలిక స్టాండ్‌ను ఏర్పాటు చేసుకుని వాహనాలను నిలుపుదల చేస్తున్నారన్నారు. ఆయా స్టాండ్‌ను సీఐటీయూ నాయకులు సందర్శించి కార్మికుల తరపున నినాదాలు చేశారు. తక్షణమే శాశ్వత స్టాండ్‌ను కేటాయించాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. అలాగే కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లు రద్దు చేయాలనే డిమాండ్‌తో ఈ నెల 20న చేపట్టనున్న సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ ప్రతినిధులు హెచ్.ఈశ్వరరావు, బి.కృష్ణారావు, బి.హరి, యు.శ్రీను, ఆర్.రాజారావు, జి.జగదీష్, ఎ.కోదండ పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న సీఐటీయూ నాయకులు

విద్యార్థులకు శిక్షణ తరగతులు

సోంపేట: మండలంలోని ఎర్రముక్కాం గ్రామంలో వేటు సక్సెస్ సంస్థ ఆధ్వర్యంలో వేసవి ఉచిత శిక్షణ తరగతులు బుధవారం ప్రారంభమయ్యాయి. ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియెట్ చదువుతున్న విద్యార్థులకు అర్థమెటిక్, రీజనింగ్, మ్యాథ్స్ పంఘ మెంటల్, సైన్స్, ఆరోగ్య విద్య తదితర అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్టు నిర్వాహకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా పాకిస్తాన్ సైనికుల కాల్పుల్లో ఇటీవల మృతి చెందిన రాష్ట్రానికి చెందిన సిపాయి మురళినాయక్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కుందు రామారావు, ఉపాధ్యాయులు జగన్, బైపల్లి దామోదరరావు, బైపల్లి మురళి, సంధ్య పాల్గొన్నారు.



మురళీనాయక్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

సక్రమంగా రుణప్రణాళిక

కవిటి: రుణ ప్రణాళికలను సక్రమంగా సిద్ధం చేయడం ద్వారా మహిళా స్వయంశక్తి సంఘాల ఆర్థికాభివృద్ధికి బాటలు వేసుకోవాలని ప్రత్యేకాధికారి, సెర్ప్ ఏజీఎం సత్యన్నారాయణ అన్నారు. బుధవారం కవిటి మండల మహిళా సమాఖ్య(ఎంఎంఎస్) భవనంలో వార్షిక క్రెడిట్ లైవ్ ప్లాన్‌లో భాగంగా ఏపీఎం కె.గోవింద్ ఆధ్వర్యంలో ఒక్కరోజు వర్క్‌షాప్ నిర్వహించారు. మండలంలోని అన్ని గ్రామ సంఘాల అధ్యక్షులు, వీవోఏలకు యాన్యువల్లీ క్రెడిట్ లైవ్ ప్లాన్ సంబంధించి సంఘస్థాయిలో రుణ ప్రణాళిక ఆవశ్యకతను వివరించారు. శ్రీనిధి మేనేజర్ రాము తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో ఏజీఎం సత్యన్నారాయణ తదితరులు

ఇచ్ఛాపురం టౌన్: మున్సిపాలిటీలోని వైఎస్సార్ కల్యాణ మండపంలో మహిళల కోసం ఏర్పాటు చేసిన ఉచిత టైలరింగ్ శిక్షణ శిబిరాన్ని స్థానిక ఎమ్మెల్యే బెందాళం అశోక్ బుధవారం ప్రారంభించారు. ఆసక్తి ఉన్నవారు శిబిరాన్ని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. మున్సిపాలిటీ నుంచి 25 మంది, మండలం నుంచి 125 మంది శిక్షణకు హాజరయ్యారు. మున్సిపల్ కమిషనర్ ఎన్.రమేష్, ఎంపీడీవో కె.రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గంగాలమ్మ అమ్మవారి వార్షికోత్సవం

సోంపేట: మండలంలోని లక్కవరం గ్రామంలో గంగాలమ్మ గ్రామదేవత ఆలయ ద్వితీయ వార్షికోత్సవాన్ని గ్రామస్తులు బుధవారం ఘనంగా నిర్వహించారు. వేదపండితులు రఘునాథ్ పాణిగ్రాహి, రమేష్, కిరణ్ పర్యవేక్షణలో ప్రత్యేక పూజలు చేశారు. కుంకుమ పూజల్లో గ్రామానికి చెందిన మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పరిసర గ్రామాల భక్తులు అమ్మవారిని దర్శించుకుని అన్న, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



కుంకుమ పూజల్లో మహిళలు

సేంద్రియ పద్ధతిలో సాగుతో ప్రయోజనం

కంచిలి: సేంద్రియ పద్ధతిలో నవధాన్యాలు సాగుచేయడం వలన రైతుకు ఎన్నో ప్రయోజనాలున్నాయని మండల యాంకర్ టి.శివానందం పేర్కొన్నారు. అంపురం గ్రామంలో సేంద్రియ పద్ధతిలో వ్యవసాయ విధానం గురించి, నవధాన్యాల కిట్ల తయారీపై స్థానిక రైతులకు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వీటి ఉపయోగాన్ని రైతులకు వివరించారు. ఖరీఫ్ ప్రణాళిక గురింర్చి వివరించారు. నవధాన్యాల సాగు చేయడం వలన కలుపు కూడా పూర్తిగా నివారణ అవుతుందన్నారు. భూమి గుల్లపడుతుందని, భూమిలో వానపాములు శాతం పెరుగుతుందని, పశువులకు దాణాగా ఉపయోగపడుతుందని అన్నారు. నీటి శాతం నిలువ ఉంటుందని, ప్రధాన పంటకు చీడపీడల నుంచి తట్టుకుంటుందన్నారు. వాతావరణ వైపరీత్యానికి తట్టుకుంటుందని రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఐసీఆర్‌పీలు శీర కామరాజు, చిట్టిబాబు, ఎంటీ తులసయ్య, పుష్ప, రోహిణి, డి శ్రీదేవి, ఎం.ఎస్. ఓ.బి. కళ్ల లక్ష్మి, లీడ్ ఫార్మర్స్ పాల్గొన్నారు.



సేంద్రియ వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

ప్రత్యేక అవసరాల పిల్లల గుర్తింపు

టెక్కలి రూరల్: రాష్ట్ర ప్రభుత్వం, సమగ్ర శిక్షా ద్వారా చేపడుతున్న 0-18 సంవత్సరాల్లోపు ప్రత్యేక అవసరాల గల బడిబయట పిల్లల గుర్తింపు ప్రక్రియను అధికారులు చేపడుతున్నారు. దీనిలో భాగంగా పెద్దసాన గ్రామంలో బడిబయట పిల్లల గుర్తింపు సర్వేను బుధవారం నిర్వహించారు. సర్వేలో డిప్యూటీ ఈవో విలియమ్స్, ఎంఈవో-2 చిన్నారావు, సాహిత ఉపాధ్యాయులు ఎ.మన్మథరావు, ఎం.ధనుంజయ్ పాల్గొన్నారు. సర్వే ప్రక్రియ వచ్చే నెల తొమ్మిదో తేదీ వరకు నిర్వహిస్తారు. వివరాలకు 83309 81418, 8185830538 నంబర్లకు సంప్రదించాలని కోరారు.

ట్రాఫిక్ చిక్కులు..



మండలంలోని అయోధ్యపురం గ్రామంలో నిర్వహించిన గ్రామదేవత ఉత్సవాల ముగింపు సందర్భంగా బుధవారం బంధువుల రాకపోకలతో ఆ మార్గం రద్దీగా మారింది. కొంతమంది తమ వాహనాలను రోడ్డు పక్కనే పార్కింగ్ చేయడంతో రాకపోకలు నిలిచిపోయాయి. గంటల తరబడి వాహనాలు నిలిచిపోవడంతో ట్రాఫిక్ క్లియరెన్స్ చేయడానికి పోలీసులు తిప్పలు పడ్డారు. తప్పనిసరి పరిస్థితుల్లో పొలాల మీదుగా రాకపోకలు సాగించారు. –టెక్కలి

చిన్నారులకు ఆటల పోటీలు



విద్యార్థులకు పోటీతత్వం అవసరమని మందస గ్రంథాలయ అధికారిని జె.విజయలక్ష్మి అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులకు చెస్, క్యారం బోర్డ్ పోటీలు బుధవారం నిర్వహించారు. అలాగే బాటిల్ బాల్ గేమ్, లెమన్ స్పూన్ ఆడిపించారు. గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. –మందస

తిరగని ఫ్యాన్లు..



పూడి రైల్వేస్టేషన్‌లో ఫ్యాన్లు తిరగక ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ఓ పక్క మండుతున్న ఎండలు, మరో పక్క ఉక్కబోతతో ఈ స్టేషన్ నుంచి వేర్వేరు ప్రాంతాలకు వెళ్లేందుకు వచ్చేవారు ఫ్యాన్లు తిరగక ఆపసోపాలు ఎదుర్కొంటున్నారు. స్టేషన్ మాస్టర్ ఇతర సిబ్బందికి చెప్పినా పట్టించుకోవ డం లేదని వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి స్టేషన్లో ఫ్యాన్‌లు తిరిగేలా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కె.రాజు, ఎం.రమేష్, కె.అరుణ, లలితకుమారి కోరారు. – వజ్రపుకొత్తూరు

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

టెక్కలి 7093164422

పలాస / ఇచ్ఛాపురం 9010178979

Office mail : sklmadvt@gmail.com